496) శంకరాభరణం

ప॥ ఎంత కెంత యిది యేమని పొగడుట । యింత సేయ నీకు నెదురా వీరు ॥

చ॥ పిడుగులబోలెడిపెనునీనఖముల- । కెడయక హిరణ్యు డెట్లుండెనో ।
వుడికెటిచక్రాయుధమువేడికిని । జడియక మకరెటు సహించెనో ॥

చ॥ శరపరంపరల శిరములు నఱకగ । యెరగొని రావణుడేమనెనో ।
పరియలువారగ బ్రహ్మాండభాండము । ఉరుశంఖరవం బోర్చుట యెట్లో ॥

చ॥ గాటపునిష్ఠురగదాహతికి మధు- । కైటభులతలలకత లెట్లో ।
యీటున శ్రీవేంకటేశ నీకృపను । పాటించి దాసులు బ్రదుకుట యెట్లో ॥